సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



పట్ట పగలే చోరీ

రాయచోటిలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ చోరీలో 500 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.4.75 లక్షలు అపహరణకు గురైనట్లు బాధితులు వివరించారు. -8లో



ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రామసముద్రం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యార్థిని సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.460	రూ.540
రెండోరకం	రూ.330	రూ.440

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 199 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులతోపాటు ఆయా శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్): ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా నిరుపేద ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇవ్వబోయే ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఎన్.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను ప్రముఖ ప్రైవేటు శిక్షణ సంస్థలను గుర్తించి వాటి ద్వారా ఇప్పించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి శిక్షణ సంస్థల యజమానులు, అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 25వ తేదీ వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. వివరాలకు 9440256697 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

15న తాళ్లపాకలో నగర సంకీర్తన

రాజంపేట: శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్ట్ సంస్కృతి ఆధ్వర్యంలో నవంబర్ 15న అన్నమాచార్యుని జన్మస్థలి తాళ్లపాకలో అన్నమయ్య సేవ నగరసంకీర్తన ఉంటుందని అన్నమయ్య సేవ సెక్రటరీ తాళ్లపాక గౌరీ ప్రసన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య' కార్యక్రమంలో భాగంగా అన్నమాచార్య సేవాట్రస్ట్ సంస్కృతి డైరక్టరు మీనాక్షి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాళ్లపాక నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్తీకపౌర్ణమిరోజున స్వామి భక్తులు అన్నమయ్య సంకీర్తనలతో, అన్నమయ్య పల్లకీ సేవ, నగర సంకీర్తన కోలాట బృందం వారితో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని భక్తులు జయప్రదం చేయాలన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

మదనపల్లె సిటీ: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డి లే అవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పదో తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. గత ఏడాది 93 శాతం ఫలితాలు సాధించామని, ఎన్ఎంఎంఎస్‌లో 23 మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్ డీఈఓకు వివరించారు. మధ్యాహ్న భోజనంను రుచి చూశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంఓ కరుణాకర్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాలపై కేసు నమోదు

గుర్రంకొండ: గుప్తనిధుల తవ్వకాల సంఘటనపై అధికారులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన గుప్తనిధుల కోసం తవ్వకాలుపై అధికారులు స్పందించారు. మంగళవారం రాయచోటి దేవదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ విశ్వనాథం రాజు పోలీసులతో కలసి గుప్తనిధుల తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని సందర్శించారు. పురాతన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ మండపాన్ని దుండగులు గుప్తనిధుల కోసం తొలగించిన దృశ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపే ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

నవోదయ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోండి

కడప ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష–2025కి సంబంధించి 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లు భర్తీ చేయుటకు 8వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల యాజమాన్య ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు navodaya.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని డీఈఓ తెలిపారు.

కదిపితే కన్నీళ్లే!

రెప్పపాటులో జరిగిన ప్రమాదం రెండూళ్లలో తీరని విషాదాన్ని నింపింది. ఒకరా.. ఇద్దరా.. ఒకేసారి ఐదుగురిని కబళించి ఆయా కుటుంబాల వారిని నిండు చీకట్లోకి తోసేసింది. ఓ ఇంట తల్లిదండ్రుల్ని దూరం చేసి ఇద్దరు పిల్లల్ని అనాథల్ని చేసింది. మరో ఇంట భర్త, అత్తను చిదిమేసి ఓ ఇల్లాలిని అభాగ్యురాలిగా మార్చింది. విధి ఆడిన ఈ కర్కశ ఆటలో బలైన అందరూ రక్తసంబంధీకులే కావడంతో ఆ బంధువుల రోదన మిన్నంటింది. వారిని కదిపితే చాలు కన్నీరొలుకుతోంది.

- రోడ్డు ప్రమాదంలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య
- మంగళవారం పూర్తయిన అంత్యక్రియలు
- తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన చిన్నారులు





మృతి చెందిన నూరుల్లా, ఫకీరమ్మ (ఫైల్)



పీలేరు ప్రభుత్వ ఆసుపత్రివద్ద విలపిస్తున్న మృతులబంధువులు

కలికిరి: మండలంలోని టి.సంద్రావారిపల్లి గ్రామ దూదేకులపల్లిలో, సోమలమండలం తెట్టుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం రాత్రి కలకడ సమీపం ఇందిరమ్మకాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు మృత్యువాతపడగా..మంగళవారం చికిత్సపొందుతూ మరొకరు కన్నుమూశారు. తీవ్రగాయాలతో ఇంకొకరు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అమ్మ..కూతురు..ఇద్దరల్లుళ్లు

దూదేకులపల్లికి చెందిన కాములూరి ఎహసానుల్లా.. ఖాదర్ బీ దంపతులు. కూతుళ్ల..అల్లుళ్లతో కలిసి తమ బంధువుల్లో ఒకరి అంత్యక్రియల కోసం వెళ్లొస్తుండగా మృత్యువు కాటేసింది. ఈ ప్రమాదంలో ఖాదర్ బీ (60), ఆమె చిన్న కూతురు దిల్షాద్ (30) చిన్నల్లుడు ఖాదర్ వల్లి (35), రెండో అల్లుడు నూరుల్లా (40) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. వీరితో పాటు నూరుల్లా తల్లి ఫకీరమ్మ కూడా చనిపోయింది.

తల్లీకొడుకు ఒకేసారి..

మృత్యువు తల్లీ కొడుకులను ఒకేసారి కబళించింది. సోమల మండలం నెల్లిమంద గ్రామం తెట్టుపల్లికి చెందిన నూరుల్లాకు ఖాదర్ బీ రెండవ కుమార్తె మరిమతో వివాహమైంది. వీరికి సమీర, అమీషా ఇద్దరు కూతుళ్లు. ఆర్నెళ్ల కిందటే పెద్ద కుమార్తె సమీరకు వివాహం జరిపించారు. రోడ్డు ప్రమాదంలో మరిమ తన భర్త నూరుల్లాతో పాటు ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న అత్త ఫకీరమ్మను కూడా కోల్పోయింది. తల్లీ కొడుకు ఒకేసారి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు మృతదేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



ఫకీరమ్మ, నూరుల్లా మృతదేహాలకు నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు

కోమాలోనే ఎహసానుల్లా

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎహసానుల్లా కోమాలోకి వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో భార్య చనిపోయిందన్న విషయం తెలీకపోవడం విషాదకరం. ఇద్దరల్లుల్లతో పాటు ఒక కూతురు మృత్యువాత పడిందన్న వార్త కూడా ఆయన మనసుకు చేరలేదు. ప్రస్తుతం ఆయన తిరుపతిలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



చికిత్స పొందుతున్న ఎహసానుల్లా

అమ్మానాన్న దూరమై..



కుమారుడు ఫైజర్‌తో దిల్షాద్, ఖాదర్ దంపతులు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన దిల్షాద్..ఖాదర్‌లకు ఇద్దరు సంతానం. కొడుకు ఫైజర్‌కు ఎనిమిదేళ్లు కాగా.. కూతురు సారాకి నాలుగేళ్లు. తల్లిదండ్రులిద్దరూ దూరమవడంతో చిన్నారులు అనాథగా మిగిలారు. ఇక ఎప్పటికీ రాని తల్లిదండ్రుల మృతదేహాల వంక దీనంగా చూస్తూ నిలబడిపోయిన పిల్లలిద్దర్ని చూసిన జనం కంటతడి పెట్టారు. ఇప్పుడు వారి ఆలనాపాలనంతా నాయనమ్మ ఫాతిమా (62)పై పడింది. అసలే ఆమె పేదరాలు. వృద్ధాప్యంలో తోడుగా ఉంటాడనుకున్న చెట్టంత కొడుకు దూరమయ్యాడు. పైగా పిల్లల సంరక్షణ భారం కూడా పడడంతో ఆమె దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది.



తల్లిదండ్రులిద్దరిని కోల్పోయిన చిన్నారులు సారా, ఫైజర్

నేడు వైఎస్సార్ జిల్లాలో మాజీ సీఎం

వైఎస్ జగన్ పర్యటన



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.50 గంటలకు గుంటూరు పోలీస్ పెరేడ్ మైదానంలోని హెలీప్యాడ్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు బద్వేల్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 1.10 గంటలకు హెలీప్యాడ్ నుంచి బద్వేల్‌లోని రామాంజనేయనగర్‌లో ఇటీవల ప్రేమోన్మాది పెట్రోల్ దాడిలో గాయపడి మరణించిన విద్యార్థిని దస్తగిరమ్మ నివాసానికి వెళ్లి ఆమెకు నివాళులు అర్పించి తల్లిదండ్రులను పరామర్శిస్తారు. 2.10 గంటలకు దస్తగిరమ్మ నివాసం నుంచి బయలుదేరి 2.20 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.30 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.55 గంటలకు పులివెందులలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.20 గంటలకు పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు.

హెలీప్యాడ్ స్థల పరిశీలన

గోపవరం/అట్లూరు: ఈ నెల 19వ తేదీన ప్రేమోన్మాది దాడిలో మృతిచెందిన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చేందుకు బుధవారం బద్వేలుకు వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. బుధవారం గుంటూరు పర్యటన అనంతరం వైఎస్ జగన్ హెలికాప్టర్ ద్వారా బద్వేలుకు రానున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పి.పి.కుంట వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ స్థలాన్ని వారు పరిశీలించారు. నాయకులు కె.రమణా రెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతమైన సేవలందించాలి

కలెక్టర్ శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: పౌరులకు వేగవంతంగా సేవలు అందించి రెవెన్యూశాఖ ప్రతిష్టను పెంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రాయచోటి డివిజన్ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి భూ పరిపాలనశాఖ కార్యాలయాలు, పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, డివిజన్‌లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన, హైకోర్టు, ఆర్టీఐ, జాతీయ మానవహక్కుల కమీషన్ కేసులు, భూసేకరణ, నీటిపన్ను వసూళ్లు, డివిజన్ స్థాయి విజిలెన్సు మానిటరింగ్ కమిటీ తీర్మానాలు తదితర అంశాలలో సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూ చట్టాలు, విధులను బాధ్యతగా అమలు చేయాలని, విధుల అమలులో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామిస ఎస్‌డీసీ రామసుబ్బయ్య, జిల్లా సర్వేశాఖ ఏడీ భరత్ కుమార్, రాయచోటి డివిజన్ తహసీల్దార్లు, డీటీలు, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రతి పనిని పూర్తి చేయాలి

పల్లెపండుగ వారోత్సవాలలో మంజూరైన ప్రతి పనిని పూర్తి చేయాలని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పీఆర్ ఇంజనీర్లు, ఉపాధిహామీ ఏపీఓలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రభుత్వం 'పల్లె పండుగ' ద్వారా గ్రామాలకు అవసరమైన రహదారులు, కాలువలు, విద్యుత్ తదితర మౌళిక వసతులతో కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమాల అమలుకు ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్ ఇంజనీర్లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందరి మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. జిల్లాలో 722 అంతర్గత సీసీ రోడ్లకు అనుమతులు మంజూరు చేశామని.. ఈ పనులన్నీ డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో 1200 పశువుల షెడ్లు మంజూరు చేస్తే 600కు మాత్రమే ప్రతిపాదనలు వచ్చాయన్నారు. మిగిలిన వాటికి మూడు రోజులలో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఉద్యానవన మొక్కల పెంపకం, రహదారుల పక్కన అవెన్యూ ప్లాంటేషన్ బాగా చేయాలన్నారు.

ఎట్లా.. ఎదుర్లగుట్టకే ఎసరా!



ఎదుర్లగుట్టను చదును చేసి కబ్జా చేసిన భూమి



ఎదుర్లగుట్ట ఆక్రమణ కోసం తొలగించిన బండరాళ్లు

- 20 ఎకరాలకుపైగా చదును చేసిన టీడీపీ నాయకుడు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బి.కొత్తకోట: టీడీపీ నేతల భూ దాహానికి కొండలు, గుట్టలు నిలువునా కరిగిపోతున్నాయి. చూస్తుండగానే చుట్టూ కంచెలు లేస్తున్నాయి. ముఖ్యంగా బి.కొత్తకోట మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. మొన్నటిదాకా చెరువులు, వంకలు, కాలువలు కబ్జాకు గురైతే ఇప్పుడు ఏకంగా కొండలు, గుట్టలే కబ్జాలకు గురవుతున్నాయి. మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయి. ఈ పంచాయతీకి చెందిన ఓ తెలుగుదేశం పార్టీ నేత ఎదుర్లగుట్టకు బోడిగుండు కొట్టిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఇక మనకు ఎదురులేదన్నట్టుగా సదరు నాయకుడు ఏకంగా గుట్టను చెరబట్టాడు. ఈ గుట్టకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, చుట్టూ ఎలాంటి జనావాసాలు లేకపోవడంతో ఆ టీడీపీ నేతకు కలిసొచ్చింది.

'గుట్ట'చప్పుడు కాకుండా!

కొన్నిరోజుల పాటు జేసీబీలతో గుట్ట కింద భాగంలో మొదలు నుంచి చివరిదాక కొండ చుట్టూ తవ్వేశారు. పక్కనే ఉన్న మరో కొండను చదనుచేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా కొండను తొలిచేసి చదును చేసిన భూమి 20 ఎకరాలకుపైగా ఉంటుందని అంచనా. గుట్ట చుట్టూ నెక్లెస్ మాదిరి గుట్టకింద భాగం మొత్తం పెద్ద పెద్ద రాళ్లు, బండలను తొలగించి మూడు వరసలుగా గుట్టను చదును చేశారు. దీనిపక్కనే ఉన్న చెరువు పైభాగంలోని కొండను తొలచి చదును చేశారు.

చోద్యం చూస్తున్న అధికారులు..

యంత్రాలతో రాత్రి పగలు పనిచేసి గుట్టను కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ విషయం వీఆర్ఓకు తెలిసినా అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా రహస్యంగా ఉంచినట్టు తెలుస్తోంది. గత తహసీల్దార్ శ్రీధర్‌రావు దృష్టికి ఈ విషయం రావడంతో తక్షణమే చర్యలు తీసుకుని వివరాలు నివేదించాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. సదరు తహసీల్దార్ 37 రోజులు మాత్రమే పనిచేయడం, బదిలీ అయ్యే రెండురోజుల ముందుకు ఈ గుట్ట భూమి కబ్జా విషయం ఆయన దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన చర్యలు తీసుకోవడానికి వీలులేకుండా పోయింది. తర్వాత అధికారులకు ఈ విషయం తెలియకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది దీన్ని బయటపెట్టకుండా దాచి ఉంచడంతో వెలుగులోకి రాలేదు. కాగా విలువైన గుట్ట భూమి కబ్జా విషయంలో ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆడపిల్లకు బతుకునిద్దాం

ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పురుషులకు ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. నాగలి పట్టి నేల దున్నడమే కాదు .. పైలట్‌గా మారి నింగిలోనూ దూసుకెళ్తున్నారు. ఇంత ఎదుగుతున్నా.. 'ఆడపిల్ల' భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కళ్లు తెరవక ముందే కడుపులోనే చిదిమేస్తుండడం కలవరపెడుతోంది. భ్రూణ హత్యలు సమాజానికి ప్రమాదకరంగా మారాయి.

- స్కానింగ్ సెంటర్లపై నిఘా కరువు
- పలుచోట్ల యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు
- ఆందోళన కలిగిస్తున్న బాలబాలికల నిష్పత్తి



మదనపల్లె సిటీ: ఆడపిల్ల అంటే.. ఆదిశక్తికి ప్రతిరూపం అంటారు. శివుడిలో సగభాగమని కొలుస్తారు.. అవనిలో సగం అంటారు.. తమ ఇంట మాత్రం వదిలించుకోవాలని చూస్తున్నారు. అవును.. పుట్టబోయేది ఆడ పిల్ల అని తెలుసుని ఆదిలోనే చిదిమేస్తున్నారు. కాసుల కోసం కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు పుట్టబోయేది ఆడ,మగ అనేది ముందే చెప్పేస్తూ... భ్రూణహత్యలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో నిరక్షరాస్యత, పేదరికం కూడా వాటికి తోడవుతోంది.

'తనిఖీల్లో వెలుగు చూస్తున్న నిజాలు

జిల్లాలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై అధికారుల నిఘా కరవైంది. గతంలో పోల్చితే నిర్ధారణ పరీక్షలు తగ్గినా. . పలుచోట్ల గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. కొంత మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఆడ,మగ అన్నది కోడ్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లాలోని పీలేరు పట్టణంలోని ఓ స్కానింగ్ కేంద్రం అనుమతి లేకుండానే స్కానింగులు చేస్తుండగా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. మదనపల్లెలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రెండు స్కానింగ్ కేంద్రాలను అనుమతులు లేవు. మరో రెండు స్కానింగ్ కేంద్రాల్లో తాము పరీక్షలు నిర్వహించడం లేదని తెలియజేశారు. రాయచోటి, రాజంపేట,రైల్వేకోడూరులతో పాటు జిల్లా వ్యాప్తంగా కొన్ని స్కానింగ్ కేంద్రాలకు అనుమతి లేకున్నా గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



పీలేరులో ఓ స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు (ఫైల్)

అనుమతి తప్పనిసరి: జన్యు సంబంధ పద్ధతులపై పరీక్షలు నిర్వహించే వ్యక్తులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, వైద్యులు తప్పనిసరిగా సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి నిర్ణీత రుసుం చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలి. గర్భస్థ పిండ ఆరోగ్య స్థితిని పరీక్షించేందుకు అనేక ఆధునిక వైద్య పరికరాలు, సౌకర్యాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

చట్టం ఏం చెబుతోంది..

భారత ప్రభుత్వం గర్భస్థ పిండ పరీక్ష నియంత్రణ, దుర్వినియోగ నివారణ చట్టం1994ను తీసుకువచ్చింది. ఇదే చట్టాన్ని 2003 సంవత్సరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టంగా రూపొందించారు. దీని ప్రకారం స్కానింగ్ పరికరాల ఉత్పత్తిదారులు, పంపిణీదారులు, అమ్మకపు దారులు, రిజిస్టర్ పత్రం సమర్పించనిదే వాటిని వినియోగదారుడికి అమ్మకూడదు. ఈ రిజిస్టర్ పత్రం అయిదేళ్లకు ఒకసారి తిరిగి నమోదు చేయాల్సి ఉంటుంది. స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ చేయడం నేరం. చట్ట ప్రకారం మొదటి సారి నిబంధనల ఉల్లంఘనకు 3 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా, రెండో సారి చేస్తే అయిదు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.50వేలు జరిమానాతో పాటు రాష్ట్ర వైద్య మండలి, సంఘం నుంచి తొలగిస్తారు. అలాగే నేరాలకు సహకరించిన వారికి, ప్రోత్సహించిన వారికి,గర్భిణి భర్త, బంధువులు, ఇతర సంబంధీకులకు కూడా శిక్షతో పాటు జరిమానా ఉంటుంది.

ఇలా చేస్తే ప్రయోజనం

- లింగనిర్ధారణ పరీక్షలపై చర్యలు తీసుకోవాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- వరకట్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వరకట్నం తీసుకున్నట్లు తెలిసినా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి.
- ఆడపిల్లల చదువు కోసం పథకాలు అమలు చేయాలి.
- ఆడ శిశువులకు జన్మనిచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి.

జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు: 129

మదనపల్లె: 59

రాయచోటి: 46

రాజంపేట: 24



జిల్లాలో 1000 మంది పురుషులకు 589 మంది మహిళలు ఉన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి స్కానింగ్ సెంటర్ నిబంధనలు తప్పకుండా పాటించాలి. ప్రతి స్కాన్ సెంటర్‌లో ఐఈసీ ఫ్లెక్సీలు ప్రదర్శించాలి. దీనిపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్ల వైద్యులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. –దేవశిరోమణి, జిల్లా స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ అధికారిణి

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం


లోకేష్

సంబేపల్లె : మండల పరిధిలోని అడవికమ్మపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కుంచపు లోకేష్ అనే విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల మేరకు అడవికమ్మపల్లెకు చెందిన లోకేష్ సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తండ్రి రామయ్య మంగళవారం సంబేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం గాలింపు చర్యలు చేపట్టారు.

అనుభవం ఒకరిది.. పట్టా ఇంకొకరికి


తమ అనుభవంలో ఉన్న భూమిని మరొకరికి పట్టా ఇచ్చారంటూ వాపోతున్న రైతులు

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో పుల్లమంరాజుగారిపల్లికి చెందిన రైతుల అనుభవంలో ఉన్న భూమిని మరొక్కరికి పట్టా ఇచ్చారంటూ రైతులు వాపోతున్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో రైతులు రెడ్డిరాజు, రామరాజు, చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి తమ అనుభవంలో ఉందన్నారు. తమ అనుభవంలో ఉన్న భూమిని తమకే పట్టాలు ఇవ్వాలని కోరారు. గతంలో తాము పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నామని, అయినా వేరే వ్యక్తులకు రెవెన్యూ సిబ్బంది పట్టాలు ఇచ్చారని వారు వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఫాతిమా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.చాణిక్య అండర్-14 జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిష తెలిపారు.

బట్టలిప్పి కొడతా నా కొడకా!

- దళితుడిని అవమానించిన ఎస్ఐ
- ఫోన్‌లో నానా దుర్భాషలు
- విలేకరుల సమావేశంలో బాధితుడి ఆరోపణ




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం (బాధితుడు కె.రఘు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం ఎస్ఐ తనను బట్టలు విప్పి కొడతా నాకొడగా అంటూ ఫోన్‌లో దుర్భాషలాడినట్లు వాల్మీకిపురం పట్టణం గాంధీపేటకు చెందిన కె.రఘు అనే దళితుడు ఆరోపించాడు. మంగళవారం విలేకరుల సమావేశంలో బాధితుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం గురించి అడగ్గా.. ఎవడ్రా నువ్వు నాకు ఫోన్ చేసేదానికి, నీకు ఎంత ధైర్యం నా కొడకా, స్టేషన్‌కు వస్తే బట్టలు విప్పి కొడతా కొడకా అని దుర్భాషలాడినట్లు తెలిపారు. దళితులు ఎక్కడ ఉండాలో అక్కడే ఉండాలి అంటూ నానా రకాలుగా మాట్లాడారన్నారు. దీంతో తాను, మరో 20 మంది స్టేషన్‌కు వెళ్లగా నేను బిజీగా ఉన్నాను, పక్కన విచారించి వెళ్లండి అని ఎస్ఐ సమాధానమిచ్చారన్నారు. దీంతో వెంటనే సీఐకి సమాచారం ఇవ్వగా తాను మాట్లాడతానని చెప్పి ఇప్పటికి నాలుగు రోజులు అవుతున్నా, ఇంత వరకు తనకు న్యాయం చేయలేదన్నాడు.

దళితుడిని అవమానించడం అమానుషం

వాల్మీకిపురం పట్టణం గాంధీపేటకు చెందిన మాల మహానాడు జిల్లా కార్యదర్శి రఘు అవసర నిమిత్తం వాల్మీకిపురం ఎస్ఐకి ఫోన్ చేస్తే నువ్వు దళితుడివి నాకేంది ఫోన్ చేసేది.. నీకేమైనా ఉంటే నేరుగా స్టేషన్‌కు వచ్చి మాట్లాడు అని అవమానించడం అమానుషం అని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం అన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యత గల పోలీస్ అధికారి దళితులపై చిన్నచూపు చూడడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శివయ్య, రాయలసీమ ఉపాధ్యక్షుడు యమలా చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లెల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరినీ దూషించలేదు: ఎస్ఐ

దళిత నాయకుడిని దూషించిన విషయమై ఎస్ఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా తాను బిజీగా ఉండటం వలన సరిగా ఫోన్ మాట్లాడలేదని, ఎవరినీ కులంపేరుతో దూషించలేదన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరైనా రావొచ్చని.. స్నేహపూరితంగా వారితో మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.

క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు


భూమి పూజ నిర్వహిస్తున్న డీఈఓ, నాయకులు, ఇతర అధికారులు

రాయచోటి టౌన్ : క్రీడల ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణలో భాగంగా మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కబడ్డీ పోటీల నిర్వహణ కోసం మైదానానికి టీడీపీ నాయకుడు మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29వ తేదీలలో స్కూల్ గేమ్స్ అండ్ -17 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి భానుమూర్తి రాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ వసంత, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, అటవీ సంపదను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి వినీత్‌కుమార్ ఆదేశించారు.

మంగళవారం జిల్లాలో ఉన్న ఉప అటవీ అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఫారెస్టు ప్రొటెక్షన్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎకో టూరిజం, నగరవనం, అరణ్య పార్కు అభివృద్ధి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఫారెస్టు అభివృద్ధి, భద్రతపై ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఇడుపులపాయ, ఒంగోలు, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఉన్న మెస్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులతో మెస్ యాజమాన్యం అందిస్తున్న ఆహారంపై అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాసిరకమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తే అలాంటి మెస్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు. మెస్‌లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆర్జీయూకేటీ ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందివ్వాలన్నారు. ఆయన వెంట డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై అటవీ అధికారుల ఆరా

వేముల : మండలంలోని పెండ్లూరు చెరువు పరిసర ప్రాంతాలలో చిరుత పులుల సంచారంపై ముద్దనూరు అటవీ శాఖ అధికారులు ఆరా తీశారు. చెరువు పరిసర ప్రాంతాలలో గత రెండు రోజులుగా చిరుత పులులు సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంగళవారం ముద్దనూరు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్‌బీఓ పద్మనాభయ్య, వీఆర్‌ఓ రమాదేవిలు చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే చిరుత పులులు కనిపించిన విషయమై గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు. ఈ ప్రాంతంలో చిరుత పులులు సంచరించినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవన్నారు. గొర్రెలు మేపుకుంటుండగా బెదిరిపోయి పారిపోవడంతో చిరుత పులి సంచరించిందన్న అనుమానం వ్యక్తం చేశారన్నారు.

ఐఓక్యూఎంకు కడప నారాయణ విద్యార్థి ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైడ్ ఇన్ మ్యాథమ్యాటిక్స్(ఐఓక్యూఎం) పరీక్షా ఫలితాల్లో కడప ఎన్‌జీఓ కాలనీలోని నారాయణ సీఓ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్‌వీ ప్రవీణ్ తొలి దశకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ ఎస్.షరీఫ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో ప్రవీణ్ 109వ ర్యాంకు సాధించాడన్నారు. విద్యార్థికి ప్రైజ్ మనీ కింద రూ. 3 లక్షలు వస్తుందన్నారు. ఐఓక్యూఎంకు ఎంపికైన విద్యార్థిని, అలాగే మ్యాథ్స్ టీచర్ శంకర్‌ను నారాయణ పాఠశాలల ఏజీఎం శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పోలీసు శాఖ తోడ్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పోలీసు శాఖలో విశేష సేవలు అందిస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు పోలీసు శాఖ అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్ బాబు తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐ వై.సుబ్బారాయుడు సతీమణి వై.వెంకటలక్ష్మికి కార్పస్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును మంగళవారం అదనపు ఎస్పీ అందజేశారు. మృతుని కుటుంబ యోగ క్షేమాలు విచారించారు. శాఖాపరంగా ఎలాంటి అవసరమున్నా తమను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈగల్ డిస్టిలరీస్‌లో సీఐడీ దాడులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలో ఉన్న ఈగల్ డిస్టిలరీస్‌లో సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిస్టిలరీస్‌లలో సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలిసి ఈ దాడులు కొనసాగించారు. రికార్డులను పరిశీలించి కొన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మద్యం తయారు చేసే పదార్థాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు సమాచారం. గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా ఈ డిస్టిలరీస్‌లో తనిఖీ నిర్వహించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ శాఖ మెరుపు దాడులు


బిల్లు చెల్లించాలని సూచిస్తున్న విద్యుత్ అధికారులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట ఎస్సీ కాలనీలో మంగళవారం విద్యుత్ శాఖ జేఈ ఆశాజ్యోతి, లైన్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. 200 యూనిట్ల కంటే ఎక్కువగా వాడి, పలుమార్లు బిల్లులు చెల్లించమని అడిగినా వారి వద్దనుంచి స్పందన లేకపోవడంతో విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన ప్రజలకు ఉచితంగా 200 యూనిట్లు విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ల కంటే అధికంగా వాడిన వారు, రశీదులు అందుకున్న 15 రోజులలోపు బకాయిలు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. లేని పక్షంలో వారి గృహాలకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న కంటైనర్


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం కారును కంటైనర్ ఢీ కొంది. స్థానికుల వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన కంటైనర్ రాజంపేటకు చెందిన కారు రెండు కడప వైపు నుంచి రాజంపేట వైపు వెళ్తుండగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకురాగానే కంటైనర్ వాహనం కారును ఢీ కొంది. దీంతో కారు మళ్లీ డివైడర్‌ను ఢీ కొని ఎడమవైపు ఉన్న ప్లాట్‌ఫామ్‌ను ఎక్కింది. అదృష్ట వశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఆకేపాటి సుగుణారెడ్డి, మధుసూదన్ రావులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సంఘటన తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు కంటైనర్‌ను ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం సమీపంలో అడ్డుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

మదనపల్లె/కురబలకోట : వేర్వేరు రోడ్డు ప్రమాద ఘటనల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పూజారివారి పల్లెకు చెందిన వెంకటరమణ (70), శ్రీరాములువారిపల్లెకు చెందిన దశరథ నాయుడు (57), ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై అంగళ్లుకు వచ్చారు. వారు బస్టాండ్‌లో ఉండగా మదనపల్లి నుంచి బి.కొత్తకోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేఅవుట్‌కు చెందిన సుజాత(38) సంతలో సరుకులు తీసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా, మల్లికార్జున సర్కిల్ వద్ద ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆటోతో పాటు డ్రైవర్‌ను వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. ఆయా ఘటనల్లో సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ


గాయపడిన విద్యార్థి

రాజంపేట : కడప-రేణిగుంట రహదారిలోని బోయనపల్లెలో మంగళవారం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సూర్యపై దస్తగిరి అతని సోదరుడు, మరికొంతమంది అనుచరులు దాడి చేశారు. దీంతో గాయపడిన సూర్యను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడి చేసిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

రామసముద్రం : రామసముద్రం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సోమవారం రాత్రి పాఠశాలలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం మండలం వడ్డివారిపల్లికి చెందిన రామచంద్ర, కళావతి దంపతుల కుమార్తె స్వప్న(16) స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులు రావడంతో ఇంటికి వెళ్లింది. అయితే బాలికకు కేజీబీవీలో చదవడం ఇష్టం లేదు. కాగా తల్లిదండ్రులు అందుకు సమ్మతించలేదు. దీంతో బాలిక పాఠశాల తరగతులు ప్రారంభం రోజున ఇంటి నుంచి పురుగుల మందు తెచ్చుకుంది. సాయంత్రం తరగతి గదిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 వాహనంలో మదనపల్లికి తరలించారు. బాలిక పరిస్థితి మెరుగుపడినట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

బాలికను పరామర్శించిన సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే, డీఈఓ

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలికను సోమవారం రాత్రి మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పరామర్శించారు. ఎస్ఓ మస్తాన్‌బీని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే మంగళవారం ఉదయం డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మండల విద్యాశాఖ అధికారులు పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన లక్ష్మణ్

ఓబులవారిపల్లె : మండలంలోని అమృతవారిపల్లి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక వైపు నుంచి బైకు ఢీకొన్న ఘటనలో లక్ష్మణ్ (26) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పార్వేటిపురం గ్రామానికి చెందిన లక్ష్మణ్ విజయదశమి సందర్భంగా కొనుగోలు చేసిన కొత్త బైకుపై సోమవారం హైదరాబాదుకు బయల్దేరాడు. రాత్రి 12 గంటలకు ముక్కవారిపల్లి పంచాయతీ, అమృతవారిపల్లి స్పీడ్ బ్రేకర్ వద్ద ముందుగా వెళ్తున్న లారీని వెనుకవైపు నుంచి వేగంగా ఢీ కొన్నాడు. దీంతో అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో రక్తస్రావం ఎక్కువగా జరిగింది. ఆలస్యంగా గుర్తించి 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు డిగ్రీ చదివి ఉద్యోగం కోసం హైదరాబాదుకు వెళ్తూ ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన యువకునికి వివాహం కాలేదు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

పట్ట పగలే చోరీ

500 గ్రాముల బంగారు, రూ.4.75 లక్షలు అపహరణ


చోరీ జరిగిన ఇంటిలో బాధితులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : రాయచోటిలో పట్టపగలే చోరీ జరిగింది. ఈ చోరీలో 500 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.4.75 లక్షలు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీసులకు వివరించారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని గున్నికుంట్ల రోడ్డులో నివాసం ఉండే రామ్మోహన్‌రెడ్డి, సుభాషిణిలు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. రామ్మోహన్‌రెడ్డి సంబేపల్లె మండలం శెట్టిపల్లెలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఆయన భార్య సుభాషిణి అదే మండలం మటుకువాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఇంటికి తాళాలు వేసి ఇద్దరూ స్కూల్‌కు వెళ్లారు. సాయంత్రం ఇద్దరు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలకొట్టబడి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం, అందులోని దుస్తులు, ఇతర వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువా లోపల దాచి ఉంచిన రూ.4.75 లక్షలు, 500 గ్రాముల బంగారు ఆభరణాలు దొంగలు దోచుకెళ్లినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి తమ సిబ్బందితో కలసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు. వేలిముద్రలు సేకరించామని, అలాగే డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సెలూన్ షాపుల ధ్వంసం ఘటనలో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో ఈ నెల 20వ తేదీ రాత్రి సెలూన్ షాపులపై దాడి చేసి ఫర్నీచర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేసిన సంఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ యంఆర్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులో టోనీ అండ్ గాయ్ ఎసెన్షియల్ సెలూన్, చీప్ అండ్ బెస్ట్, అఫోరబుల్ మెన్స్ సెలూన్ షాపులను నిర్వహిస్తున్నారు. వీటి వలన స్థానికంగా ఉన్న నాయీ బ్రాహ్మణ కులాలకు చెందిన షాపుల నిర్వాహకులు ఆదాయం తగ్గిందని భావించారు. దీంతో వారిని ఎలాగైనా భయభ్రాంతులకు గురి చేసి తరిమేయాలని నిర్ణయించుకున్నారు. శివాలయం చెక్ పోస్టు వద్ద సెలూన్ నిర్వహిస్తున్న రాచవీటి రవి కిశోర్ తన వద్ద పని చేస్తున్న వెంకటేష్ గారి రెడ్డిప్రసాద్, హసనాపురం తులసీ ప్రసన్న కుమార్‌తో కలసి ఈనెల 20వ తేదీన ఏపీ26బీఆర్5925 నంబర్ గల టయోటా కారులో వెళ్లి ఇతర ప్రాంతాలకు చెందిన వారి సెలూన్ షాపులను ధ్వంసం చేశారు. ఈ దాడిలో సుమారు రూ.7లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టి రాయచోటి పట్టణ శివార్లలోని సత్యనారాయణ స్వామి ఆలయ సమీపంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డితో పాటు ఇతర సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకున్నారని అభినందించారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్


శివప్రశాంత్, కడప (77 పరుగులు)


రేవంత్, తూర్పుగోదావరి (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. జట్టులోని లోకేష్ 53, ఫైజాన్ 73, ప్రశాంత్ 77 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. చిత్తూరు బౌలర్లు ఆశిష్‌రెడ్డి 2, మౌలా 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు 74.3 ఓవర్లలో 112 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పూర్ణ నారాయణ 45, చోళ నాగ గణేష్ 25 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు మనోజ్‌నాయుడు 4, చాణక్యసాయి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 22.4 ఓవర్లలో 82 పరుగులు చేసింది. జట్టులోని తమన్‌రెడ్డి 43, అక్షిత్‌రెడ్డి 35 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 78.5 ఓవర్లలో 162 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రుత్విక్ కల్యాణ్ 72, నిషాంత్ రెడ్డి 19 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు రేవంత్ 5, షాహిద్ 2, తమన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 17 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 28 పరుగులతో క్రీజులో నిలిచాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

దువ్వూరు(చాపాడు) : మండల పరిధిలోని నీలాపురం గ్రామానికి చెందిన వనిపెంట నరసింహులు((36) అనే వ్యక్తి మద్యం మత్తులో చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు.. నీలాపురం గ్రామానికి చెందిన వనిపెంట నరసింహులు ఇదే గ్రామానికి చెందిన శ్రీరాములుతో కలసి బైక్‌పై సోమవారం ఉదయం పని నిమిత్తం వనిపెంటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లే క్రమంలో ఇద్దరు కలసి మద్యం తాగారు. మార్గమధ్యంలో నీలాపురం సమీపంలోని హైస్కూల్ వద్ద బైక్ ఆపి తాను చెరువులోకి వెళ్లి స్నానం చేసి వస్తానని నరసింహులు చెరువులోకి దిగాడు. ఈ సమయంలో శ్రీరాములు బైక్‌పై ఇంటికి వెళ్లిపోయాడు. చెరువులోకి స్నానానికి వెళ్లిన నరసింహులు గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం నరసింహులు శవమై తేలాడు. ఈ ఘటనపై మృతుడి భార్య నాగ రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.